చుట్టుముట్టిన ఫ్లూ వైరస్!

-అన్ని జ్వరాలకు ఒకే రకమైన లక్షణాలు
-జలుబు, దగ్గు,విష జ్వరాలతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు
-గాంధీ,ఫీవర్, ఉస్మానియాలో రోగుల క్యూ
-భయం వద్దు..జాగ్రత్తలే ముఖ్యమంటున్న వైద్యులు

హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త

నగరవ్యాప్తంగా వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇన్ఫ్లూయెంజా కేసులు వేగంగా పెరుగుతున్నాయి.ఇటీవల కురుస్తున్న వర్షాలు..వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలన్నింటికీ లక్షణాలు ఒకేలా ఉండటంతో ఏది ఏ జ్వరమో తెలియక తికమకపడుతున్నారు.వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో టైఫాయిడ్, డెంగ్యూ,జలుబు, దగ్గు తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయి.వారం రోజులుగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న రోగుల్లో సీజనల్ వ్యాధుల బాధితులే ఎక్కువగా ఉంటున్నారు.సాధారణ ఫ్లూతో పోలిస్తే వీరిలో కొంత భిన్న లక్షణాలు కనిపిస్తున్నాయని పీవర్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మందిలో 102 నుంచి 104 పారన్ హీట్ వరకు తీవ్ర జ్వరం ఉంటోంది. 2-3 వారాల వరకు దగ్గు, తీవ్రమైన నీరసం వేధిస్తున్నాయి. తుంపర్ల ద్వారా ఫ్లూ వైరస్ ఇతరులకు వ్యాప్తిచెందుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఒకరి నుంచి ఒకరు ఆస్వస్థతకు గురవుతున్నారు. చిన్నపిల్లలు కూడా తీవ్ర జ్వరం దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులువుగా ఇన్ఫెక్షన్ బారిన పడుతున్నారు. తొలుత గొంతు నొప్పి తర్వాత ఒక్కసారిగా జ్వరం పెరుగుతోంది. రెండు రోజుల్లో జ్వరం తగ్గినా దగ్గు తీవ్ర నీరసం మాత్రం కొనసాగుతోంది.ఫీవర్ ఆస్పత్రి, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ రోజుల్లో పీవర్ ఆస్పత్రిలో 500-600 మంది వరకు ఔట్‌పేషెంట్లుగా నమోదు అయ్యేవారు. సోమ, శనివారాల్లో ఓపి 800-900 మంది దాటుతున్నారు. వారిలో ఎక్కువగా దగ్గు, ఆయాసం, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న ప్రతి ఇద్దరు రోగుల్లో ఒకరు దగ్గు, జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారని పేర్కొంటున్నారు. దీంతో చాలా మంది యాంటీబయోటిక్స్ తీసుకుంటున్నారు. వైరస్ కారణంగా ఈ ఇన్ఫెక్షన్లు వస్తున్నాయని, వీటికి యాంటిబయోటిక్స్ అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.బాధితుల్లో పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారని ఫీవర్ ఆస్పత్రి వర్గాలు వివరిస్తున్నారు.

పెరుగుతున్న డెంగ్యూ కేసులు...

ప్రస్తుతం వాతావరణంలో దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ,చికున్‌గున్యా తదితర వైరల్ ఫీవర్ వస్తుంటాయి. తాగునీటి వనరులు, ఆహార పదార్థాలు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రులకు రోగులు క్యూకట్టారు. నగరంతో పాటు రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన రోగులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఓపి విభాగం కిక్కిరిసింది. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ కంప్యూటర్ చిట్టీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే దుస్థితి దాపురించింది.రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే కూడా ఏటేటా అత్యధికంగా హైదరాబాద్ నగరంలోనే డెంగీ కేసులు నమోదవుతాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో దగ్గు, జలుబు, జ్వరం, వైరల్ ఫీవర్లు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ సూచించారు. ఓపీ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని వివరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం ఆపరిశుభ్రత, దోమలే. ప్రస్తుతం నగరంలో అడపాదడపా చిరు జల్లులు కురుస్తున్నందున బస్తీలు, కాలనీలలో పారిశ్య పరిస్థితులు ఆధ్వాన్నంగా తయారయ్యాయి. మురుగు కాల్వల్లో మురికి నీరు నిల్వ పేరుకుపోయి వాటి నుంచి దోమల బెడత ఎక్కువవుతోంది. దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, చికున్‌గున్యా, మొదడువాపు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. మరోవైపు వర్షపు నీటితో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. నగరంలోని బస్తీలు, కాలనీలతోపాటు శివారు ప్రాంతాలు, శివారు మున్సిపాలిటీల్లో రాత్రిపూట పాగింగ్ చేయాలి.ముఖ్యంగా బోడుప్పల్ వంటి మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగింగ్ చేయడం లేదు. ఎక్కడైన డెంగ్యూ కేసులు నమోదైతే ఆయా ప్రాంతాలకు వెళ్లి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి.రోడ్లపైన బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా చూడాలి. మురుగు కాల్వల్లో పూడికతీత చేపట్టాలి. దోమల లార్వాను తినే చేపలను (గుబూజియా చేపలు)నీరు నిల్వ ఉన్నచోట్ల వదలాలి. కానీ ఈ కార్యక్రమాలేవి సక్రమంగా జరగట్లేదు. సమస్య తీవ్రమైనప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారు.వానల వేళ దోమల తీవ్రత పెరిగింది. రెండేళ్ళుగా డెంగీ, మలేరియా కేసులు తగ్గాయని జిహెచ్ఎంసి చెబుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల కేసులేమో గాని..ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

-తరచూసబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.
'-జనం మధ్యలో ఉంటే మాస్క్ ధరించాలి. చేతులు శానిటైజ్ చేసుకోవాలి.
-కరచాలనంతో ఇన్‌ఫోక్షన్ వ్యాపించే ప్రమాదం ఉంది. కరచాలనం కంటే నమస్కారం చేయడం ఉత్తమం.
-జనసమర్థ ప్రాంతాల్లోకి మాస్క్ లేకుండా వెళ్లకూడదు.
-కళ్లు, ముక్కు, నోటిని అధికంగా తాకడం, రుద్దడం వంటివి మానాలి.
-బట్టలు, తువ్వాల, వాటర్ బాటిళ్ల వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకూడదు.
-జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉంటే చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి.

హైదరాబాద్ వార్త

అంటువ్యాధులు రాకుండా మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్

-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ సమీపంలో జరుగుతున్న మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిహెచ్ఎంసీ లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు, రాజకీయ నాయకులు జిహెచ్ఎంసి కి సహకరించి విజయవంతం చేయాలన్నారు. వార్డులో పనిచేసే శానిటేషన్ కార్మికులు మొత్తం ఒకే చోట కాకుండా ఏ ప్రాంతం వారిని అక్కడే వినియోగించుకోవాలని అడిషనల్ కమీషనర్‌ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమీషనర్ రవి కిరణ్, ఏ.ఎం.హెచ్. హేమలత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు ...

ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయొద్దని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నగరం నలువైపుల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ప్రజలు విన్నవించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... గ్రేటర్ వ్యాప్తంగా తమ సమస్యలను తెలియజేయడానికి, విన్నపం అందజేసిన నేపథ్యంలో అధికారులు వారి విన్నవించిన సమస్యను బాధ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సమస్యలు పరిష్కారంలో సంబంధిత హెచ్‌ఓడి లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొత్తం 74 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 35, ట్యాక్స్ సెక్షన్ 7, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు 5 చొప్పున, ఎలక్ట్రికల్ విభాగం 4, యు.బి.డి విభాగం 3, హెల్త్, అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్ పోర్ట్ విభాగాలకు రెండు చొప్పున, ఎ.సి రెవెన్యూ, లేక్స్, యు.సి.డి, ప్రాజెక్ట్స్, హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి, ఎ.సి లీగల్ చార్మినార్ జోన్ ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 2 ఫిర్యాదులు అందాయి. అలాగే జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 91 అర్జీలు వచ్చాయి.

నల్లకుంటలో శానిటేషన్‌డ్రైవ్ తనిఖీ చేస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించాలి : ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్,జూన్ 16 ప్రభాతవార్త: బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద జూలై 1వ తేదీన నిర్వహించే అమ్మవారి కళ్యాణం ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష ,సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్య సభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల పూజలు అందుకుంటున్న అమ్మవారం దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అ సౌకర్యాలకు గురి కావద్దనే ఆలోచనతో ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. అలయాన్ని పుణ్యక్షేత్రం మాదిరిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఆలయం చుట్టూ అద్భుతమైన రోడ్లు, ఆలయం ముందు పక్కన దాతల సహకారంతో బారీ రెకుల షెడ్లు నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంతో మహిమగల అమ్మవారం కళ్యాణం వీక్షించేందుకు నగరం నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నలు మూలల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. కళ్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి అ సౌకర్యాలు, ఆటంకాలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లు చేయాలని వారు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అమ్మవారి కళ్యాణం నిర్వాహణకు ప్రత్యేకంగా ప్రభుత్వం నుండి రూ. 10 లక్షలను కెటాయిస్తున్నామని తెలిపారు. ఎంతో గొప్పగా నిర్వహించే అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పార్టీలకు అతీతంగా అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జోగినీలు శివసత్తులకు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. కళ్యాణం తరువాత రోజున 2వ తేదీన నిర్వహించే రథోత్సవంలో ఎలాంటి అంక్షలు పెట్టవద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి దేవదాయ శాఖ కమీషనర్ వెంకట్ రావ్, అమీర్‌పేట్ కార్పోరేటర్ సరళ, ఆర్‌అండ్‌బి,రెవెన్యూ, పోలీస్, ఎండోమెంట్, ఎలక్ట్రికల్‌సిటీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని సమావేశాన్ని నిర్వహించిన, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని

నాలాలు.. పాత లేఔట్ల కబ్జాలపైనే..

-హైడ్రా ప్రజావాణిలో వెల్లువెత్తిన ఫిర్యాదులు
-పరిశీలించిన పరిష్కరిస్తామని కమిషనర్ రంగనాథ్ హామీ

హైదరాబాద్, జూన్ 16,ప్రభాతవార్త : వర్షాల వేళ.. నగరంలో నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా నాలాల మీద స్లాబులు వేసి ఇంటి ఆవరణగా మార్చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. అక్కడ నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం సాధ్యం కాక అవి పూడుకుపోతున్నాయన్నారు. మల్కాజిగిరి, బాచుపల్లి, సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్, మాధాపూర్ ఇలా నగరం నలువైపుల నుంచి నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులందాయి. వీటితో పాటు.. ఒకప్పటి గ్రామపంచాయతీ లే ఔట్లను తిరిగి వ్యవసాయ భూములుగా చిత్రీకరించి తప్పుడు పాస్ పుస్తకాలతో కొంతమంది వారసులు, కబ్జా దారులు కాజేస్తున్నారని పలువురు వాపోయారు.గూగుల్, ఎన్ ఆర్ ఎస్‌సీ, గ్రామీణ మ్యా ప్స్ తో ఫిర్యాదులను రంగనాథ్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాత లే ఔట్లలో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడుతూ నే.. అమాయకులు మోసపోకుండా చర్యలు తీసుకుంటున్నామని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో మాదిరే నాలాలు ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, అపార్టుమెంట్లు కొనేటప్పుడు అన్నీ సరి చూసుకోవాలన్నారు.

ఫిర్యాదులు ఇలా....

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ, కొరెముల గ్రామం 739 నుంచి 749 వరకూ ఉన్న సర్వే నంబర్లలో మొత్తం 147 ఎకరాలలో ఏకశిలానగర్ లే ఔట్‌ను 1985వ సంవత్సరం వేశారు. 2006లో అందులోని 47 ఎకరాల మేర వ్యవసాయ భూమిగా మార్చేసి లే ఔట్ స్వరూపాన్నే ఓ వ్యక్తి మార్చేశారని అక్కడి ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే లే ఔట్‌లో రెండు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంతమేర కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పోచారం మున్సిపాలిటీ కొరెముల గ్రామం 796 సర్వే నంబర్‌లో 11.20 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 7.20 ఎకరాల పరిధిలో ఓమెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారని.. మిగతా4 ఎకరాల తమ భూమితో పాటు.. నదెం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట కాలనీలోని ఆఫీసర్స్ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలం ఉండేదని.. ఇందులోని 500 గజాల స్థలంలో దుర్గాభవానీ ఆలయంను నిర్మించారని.. మిగిలిన 500 గజాల స్థలం కబ్జా కాకుండా పార్కును అభివృద్ధి చేయాలని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ఆలయంతో పాటు.. చుట్టూ ఉన్న దుకాణ సముదాయాల ఆదాయంతో పార్కును అభివృద్ధి చేసేలా చూడాలని కోరారు. అలాగే శ్రీనగర్ నుంచి వచ్చే వరద కాలువ తమ కాలనీకి ఆనుకుని వెళ్లేదని.. ఇప్పుడా కాలువ మాయం కావడంతో వరదంతా తమ ఇళ్లను ముంచెత్తుతోందని వాపోయారు. అల్వాల్ మండలం, జొన్న బండ గ్రామంలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900ల గజాల పార్కు స్థలం కబ్జా అవుతోందని.. దానికి ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ అక్కడి నివాసితులు హైడ్రాను కోరారు. అక్కడ రహదారులను కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారని.. 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని వాపోయారు. తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ విలేజ్‌లోని తురకోని కుంట శిఖం భూమిలో లారీల బరువును లెక్కగట్టే వేయింగ్ మెషిన్ ఏర్పాటు చేస్తున్నారని వెంటనే ఆపనులు ఆపి చెరువును కాపాడాలని సీతారామచంద్ర స్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రాను కోరారు. ఇదే ప్రాంతంలో దేవస్థానానికి చెందిన భూమి కబ్జాకు గురి అవుతోందని సేవ్ దేవరయాంజల్ ప్రతినిధులు హైడ్రా దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ విలేజీలో దేవరయాంజల్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువను మల్లించడంతో ఊరు నుంచి వచ్చే మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోందని నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వరద కాలువ నేరుగా చెరువుకు చేరేలా ఏర్పాట్లు చేస్తే గ్రామానికి వరద ముప్పు తప్పుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ రంగనాథ్

జిహెచ్ఎంసి వద్ద బిజెపి ఆందోళన

-నగర సమస్యలపై అధికారులను నిలదీసేందుకు యత్నం
-అడ్డుకున్న పోలీసులు..కార్పొరేటర్లతో తీవ్ర వాగ్వాదం
-గోడదూకి వెళ్లేందుకు యత్నించిన పలువురు కార్పొరేటర్లు

హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త: నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బల్దియా కార్యాలయం ముందు బీజేపీ ఆందోళనకు దిగింది. నగర సమస్యలపై అధికారులను నిలదీసేందుకు కమలం నేతలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఆఫీస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. వీధిదీపాలు, రోడ్ల సమస్యతో పాటు డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నిరసనకు దిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్పొరేటర్లు, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చెలరేగింది. అలాగే రామ్‌నగర్ కార్పొరేటర్‌తోపాటు మరికొంతమంది గోడలు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించారు.వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు , బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. కమిషనర్‌ను కలిసేందుకు వస్తే తమల్ని అడ్డుకోవడమేంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో వీధి దీపాలు, రోడ్లు సరిగా లేకపోవడం, నాలాల పూడిక తీయకపోవడం వంటి అనేక సమస్యలు నగర వాసులను వెంటాడుతున్నాయని, తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను చెప్పేందుకు వస్తే గేట్లు మూసేసి రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. విశ్వనగరంగా చెబుతున్న హైదరాబాద్ ఇప్పుడు వీధి దీపాలు లేక అంధకారంలో ఉందన్నారు. వీధిదీపాలు లేని కారణంగా గల్లీల్లో, కాలనీల్లో గంజాయికి అడ్డాలుగా మారాయని తెలిపారు. యువత పక్కదారి పడుతోందని, మద్యం సేవించి మహిళలను ఇబ్బందిపెట్టే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లోనే ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అంటూ ఆ పార్టీ నేతలు నిలదీశారు. తప్పకుండా బల్దియా కమిషనర్‌ను కలుస్తామని.. తమను లోపలికి పంపించకపోతే కమిషనర్ బయటకు వచ్చే వరకు ఇక్కడే ఉండి ఆందోళన చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

సంక్షేమశాఖల అధికారులు బాధ్యతతో పనిచేయాలి

-ప్రభుత్వ ఫలాలు పేదలకు అందేలా చూడాలి
-జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి

ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన నిరుపేదలకు అందేలా సంక్షేమ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు.హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్ గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన హరిచందన దాసరి సోమవారం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో పరిచయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు పేదలకు చేరేలా సంక్షేమ అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. పరిపాలనలో ఎటువంటి సమస్యలు లేదా సందేహాలు ఉన్నా నిస్సంకోచంగా నేరుగా తనను సంప్రదించాలని, సంక్షేమ, వైద్య, రెవెన్యూ శాఖలపై తమ ప్రత్యేక దృష్టి ఉంటుందని, జిల్లా అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్ గారికి పూల బొకేలు ఇచ్చి స్వాగతం తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జి ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, తహసిల్దార్లు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లో 147 దరఖాస్తుల స్వీకరణ..

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారి నుండి147 దరఖాస్తులను స్వీకరించారు. అందులో హౌసింగ్ శాఖ 77(2బి.హెచ్.కె 48, ఇందిరమ్మ ఇండ్లు 29), పెన్షన్స్ 7, కలెక్టరేట్ సెక్షన్లు 16, రెవిన్యూ 13, ఇతర శాఖలు 34 దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

హైటెక్స్‌లో రాష్ట్ర ప్రీమియర్ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఎక్స్‌పో

ఐటీటెక్స్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్, విమ్లేష్‌గుప్తా, మహేశ్వరి, సాయిరాం తదితరులు

నాంపల్లి, జూన్16 ప్రభాతవార్త : 108 సంవత్సరాల ప్రాచీన వాణిజ్య సంస్థ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్‌టిసిసిఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ప్రీమియర్ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో ఐటీటెక్స్ 2025ను తెలంగాణ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఈ నెల 27 నుండి 29వరకు మూడురోజులపాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హైదరాబాద్‌లో జరిగే ఐటిటెక్స్ 2025 రెండవ ఎడిషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు డా. సురేష్‌కుమార్ సింఘాల్ ఎక్స్‌పో కన్వీనర్ విమ్లేష్‌గుప్తా, డా. బి.శ్రీరామ్, శరత్, భవాని సురేష్, కె.కె.మహేశ్వరి తదితరులతో కలిసి రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐ సురానా ఆడిటోరియంలో సోమవారం మధ్యాహ్నం ఆవిష్కరించి ప్రసంగించారు. సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు వేయడమే ఈ ఎక్స్‌పో ముఖ్యోద్దేశమని స్పష్టం చేశారు. ఈ ఎక్స

లంగర్ హౌస్‌లో ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు.

మెహదీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ లో ఒకే దేశం ఒకే ఎన్నిక పై స్థానిక మహిళ మోర్చా అధ్యక్షురాలు సరళ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు ఉదయ్ కుమార్‌లు హాజరై మాట్లాడారు.. దేశంలో ఒకే ఎన్నిక జరగడం వలన ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్నారు. పార్లమెంటుకు రాష్ట్ర అసెంబ్లీలకు దేశంలో వేరు వేరు ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వివరించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగడంతో ఇలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు డి శ్రీకాంత్ రావు, నాయకులు గోవర్ధన్, శ్రీను, సంతోష్, ఏకలవ్య సంఘం అధ్యక్షులు నర్సింగ్ రావు, ఎల్లయ్య, ధర్మయ్య స్థానికులు పాల్గొన్నారు.

న్యూ క్లబ్ కమిటీ సభ్యులకు సత్కారం

కంటోన్మెంట్, జూన్ 16 ప్రభాతవార్తః

వెస్ట్ మరేడుపల్లి డివిజన్ కంటోన్మెంట్ నియోజకవర్గం లోని న్యూ క్లబ్ గోల్డెన్ జూబ్లీ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నోముల ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, కమిటీ సభ్యులను చొల్లేటి రమేష్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్కరించారు.

మంత్రి శ్రీహరికి రాష్ట్ర సగర సంఘం ఘన సత్కారం

మంత్రి శ్రీహరిని సత్కరిస్తున్న రాష్ట్ర సగర సంఘం సభ్యులు

సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, క్రీడలు, మత్స్యకార, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో తెలంగాణ సగర సంఘం సభ్యులు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ బీసీల పక్షపాతిగా ఉన్న ముదిరాజు బిడ్డ డాక్టర్ వాకిటి శ్రీహరికి క్యాబినెట్‌లో స్థానం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజులలో మెజారిటీగా ఉన్న బీసీల కోసం మరో ముగ్గురికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, కార్యనిర్వాహక కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సగరలు మంత్రిని తన ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు.

ఆటో మీటర్ చార్జీలను పెంచాలి

ఆటోలకు పర్మిట్లు జారీ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

సైఫాబాద్, జూన్ 16 ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో మీటర్ చార్జీలు తక్షణమే పెంచాలని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ సంఘాల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ప్రతినిధులు వి.మారయ్య, పి.శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జివొ జారి చేసిందుకు, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రభుత్వ ప్రతిపాదనను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు జెఎసి పక్షాన సిఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లుకు, రవాణా రంగ సంక్షేమ బోర్డుకు గత రెండు దశాబ్దాలుగా ఆనేక రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తున్నామని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరపడంతో కొత్తగా 60 వేల ఆటోరిక్షాలకు పర్మిట్లు ఇవ్వడానికి జివొ జారీ చేయడానికి కృషి చేశారని వారు తెలిపారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి 12 వేల ఆర్థిక సహాయం అందించాలని, ఉచిత బస్ ప్రయాణం వల్ల అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలను అదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అభినందన సభ

పిగిలం వెంకట కిషోర్ కుమార్ యాదవ్‌ను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధినేత మురళీమోహన్ రాజు ఆధ్వర్యంలో సోమవారం వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించారు. సమాజ సేవకులు, రక్తదాత పిగిలం వెంకట కిషోర్ కుమార్ యాదవ్ చేస్తున్న సామాజిక సేవల్ని గుర్తిస్తూ సోషల్ సర్వీసులో గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా అభినందన సభ జరిగింది. రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ ఎ.నటరాజ్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూ, కళాకారులకు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేస్తూ ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు నందు గౌరవ డాక్టరేట్ పొందిన డాక్టర్ పిగిలం వెంకట కిషోర్ కుమార్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎస్.రామచంద్రరావు, రచయిత మురళీమోహన్ రాజు, బొనిగిఆనందయ్య, షేక్ రియాజ్ బాషా, డాక్టర్ చీదరాల చెన్నయ్య, స్వచ్ఛంద సేవకులు వి.వి. రమణ, ఎస్.ఎస్.యాదవ్, కరస్పాండెంట్ చిల్లర శశిధర్, వ్యాఖ్యాత సత్యనారాయణ, రమణయ్య, రవి గోగుల పల్లి, కూచిపూడి గురు జోష్న తదితరులు పాల్గొన్నారు.

హామీ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటించాలి : ఎర్ర సత్యనారాయణ

సైఫాబాద్, జూన్ 15 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తరువాతే ఎన్నికలను ప్రకటించాలని లేని పక్షంలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే ప్రభుత్వానికి ఈ పడుతుందని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం హెచ్చరించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిందని, స్థానిక సంస్థల ప్రతినిధుల కాలపరమితి గడిచి ఏడాది అయ్యిందని, న్యాయ ప్రతిబంధన లేకుండా తాను తెచ్చిన కులగణన తీర్పు వచ్చి ఆరు నెలలు గడిచినా ప్రభుత్వం ఇంతవరు 42 శాతం రిజర్వేషన్‌ల అంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోయిందని ఆయన విమర్శించారు. ఇందుకు నిరసనగా ఈ నెల 18న బుధవారం మహాదీక్ష చేపడుతున్నామని సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగానే ఈ జాప్యం జరిగిందని ఆరోపించారు. కులగణన ప్రభుత్వ అసెంబ్లీ తీర్మానాలు, బిసి కమిషన్ సానుకూల నివేదికల అనంతరం కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపక పోవడం దారుణమన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా బిసిల ఓట్లు పొంది

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారం అనే లక్ష్యంతో ముందుకు పోతున్న బిజెపి ఈ రాష్ట్రం పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్‌ల అంశంలో రాజ్యాంగ రక్షణ చర్యలు చేపట్టకపోతే అధికారం కాదు కథా గత 45 సంవత్సరాల సగటు కంటే తక్కువ ఓట్లు కూడా రాకుండా పోతాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రాన్ని ఒప్పించడానికి అవసరమైన యుద్ధ కార్యాచరణ చేపట్టాలని ఆయన సూచించారు. లేని పక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి జాతీయ కార్యాలయాలను ముట్టడిస్తామని ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు కోల జనార్ధన్, దాసు సురేష్, సుధాకర్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, మీనగా గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సమానంగా నీరు అందేలా కృషి చేస్తాం

- మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

నార్సింగి, జూన్ 16 ప్రభాతవార్త : ప్రతీ ఇంటికి సమానంగా నీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాలికలు రూపొందిస్తున్నారని బండ్లగూడ కార్పోరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జల మండలి మేనేజర్‌తో కలిసి ఒకటోవార్డు ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం పర్యటించారు. అక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను అధ్యక్షులు ధన్నాడ లక్ష్మణ్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఇళ్లు పైకి, కిందికి ఉండడం వలన నీటి సరఫరా సవ్యంగా జరుగడం లేదని పేర్కొన్నాడు. స్థానికుల సమస్యలు తెలుసుకున్న తరువాత రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఈ కాలనీలో జంక్షన్ బాక్స్‌ను ఏర్పాటు చేయించి అన్ని ఇళ్లకు సమానంగా నీరు సరఫరా అయ్యేలా చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్

బండ్లగూడ కార్పోరేషన్‌లోని ఒకటోవార్డు ఇందిరా నగర్‌లో పర్యటిస్తున్న జల మండలి మేనేజర్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలు.

గౌడ్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకు రావాలని, నేను కార్పోరేషన్ కమీషనర్ దృష్టికి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి వేగంగా పరిష్కరించేలా ప్రయత్నం చేస్తానన్నారు.

సిఎం వస్తేనే ....చెత్త తొలగిస్తారా?

-కొన్ని నెలలుగా రోడ్డుపైనే చెత్తకుప్పలు
-సిఎం పర్యటనతో తొలగింపు
-జిహెచ్ఎంసి అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు

గత కొన్ని నెలలుగా రోడ్డుపై ఉన్న చెత్తకుప్పలు (ఫైల్‌ఫోటో)

అత్తాపూర్ జూన్16,ప్రభాతవార్త :

కొన్ని నెలలుగా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి ఆరంఘర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నా...దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోవాల్సి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. సోమవారం వ్యవసాయ యూనివర్సిటీలో రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరుకావడంతో హడావిడిగా జిహెచ్ఎంసి అధికారులు రోడ్డుపై ఉన్న చెత్తకుప్పలను జెసిబి సహాయంతో తొలగించారు. నెలల కొద్ది

సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో తోలగిస్తున్న అధికారులు

రోడ్డుపై చెత్త కుప్పలు ఉన్నా పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా అటువైపు కన్నెత్తి చూడని అధికారులు ఇప్పుడు తొలగించడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది చూసిన స్థానికులు సిఎం వస్తేనే చెత్త తొలగిస్తారా...వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్నా ప్రజల ప్రాణాలు పట్టవ అంటూ అధికారులపై పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి నగరానికి వచ్చే ప్రధానం మార్గం అయినప్పటికి కొందరు వ్యక్తులు యథచ్ఛేగా ఆటోలలో వ్యర్థాలను తీసుకువచ్చి దర్జాగా వేసి వెళ్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా జరిమానాలు విధించడం కూడా మరిచారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మార్గంపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి.

విజయం అనేది స్పష్టత, క్రమశిక్షణ మార్గదర్శకత్వం నుండి వస్తుంది : పుల్లెల గోపీచంద్

చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త: క్రీడలు, పౌర సేవలు ఏ రంగంలో అయినా విజయం అనేది స్పష్టత, క్రమశిక్షణ మార్గదర్శకత్వం నుండి వస్తుందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లో ఏఆర్ కె రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ నూతన కేంద్ర ప్రారంభోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గోపిచంద్ మాట్లాడుతూ ఏఆర్ కె రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమి ఉన్నత విలువలను ప్రతిబింబించే వేదికను నిర్మిస్తోందని, . లక్ష్యం, సమగ్రతతో దేశానికి సేవ చేయడానికి యువతను శక్తివంతం చేస్తుందన్నారు. ఏఆర్ కె గ్రూప్ సిఎండి జి. రామ్ రెడ్డి సంస్థ లక్ష్యంపై తన సంతోషం, నమ్మకాన్ని వ్యక్తం చేశారు. "ఏఆర్ కె వద్ద ప్రభావాన్ని సృష్టించే సంస్థలను నిర్మించడాన్ని తాము విశ్వసిస్తున్నామని, నూతన కేంద్రం ద్వారా మౌలిక సదుపాయాలను మాత్రమే విస్తరించటమే కాకుండా ప్రతి ఆశావాహునికి అందుబాటులో ఉంటూనే అవకాశం ఉద్దే

కార్యక్రమంలో పాల్గొన్న భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా

శ్యాన్ని విస్తరిస్తున్నామన్నారు. విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా మాట్లాడుతూ ఈ కేంద్రం పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి భవిష్యత్తు పునాదిగా నిలస్తుందన్నారు. డైరెక్టర్ డాక్టర్ వివేకానంద మాట్లాడుతూ ఈ కొత్త కేంద్రం వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం, సమగ్ర శిక్షణ పట్ల మా నిబద్ధతకు సహజమైన కొనసాగింపు అని అన్నారు.

బిఎంఎస్ నేషనల్ జనరల్ సెక్రటరీగా కృష్ణ

నూతనంగా ఎన్నికైన జాతీయ కార్యవర్గం

హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నేషనల్ జనరల్ సెక్రటరీగా టి.కృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. చత్తీస్‌గడ్‌లో ఈ నెల 14,15 తేదీల్లో జరిగిన చత్తీస్ గడ్ అటానమస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ త్రై వార్షిక సమావేశాల్లో బీఎంఎస్ నిర్ణయం తీసుకుంది. మూడేళ్ల క్రితం గుజరాత్ బావూనగర్ లో జరిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ జనరల్ సెక్రటరీగా నియమితులైన టి.కృష్ణ ను మరో మూడేళ్ల పాటు నేషనల్ జనరల్ సెక్రటరీగా కొనసాగిస్తూ బీఎంఎస్ నియామక ప్రతాన్ని అందజేసింది. ఇప్పటికే ఆయన భారతీయ మజ్దూర్ సంఘ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడితో పాటు భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీగా కూడా వ్యవహరిస్తున్నారు. నేషనల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన కృష్ణ మాట్లాడుతూ మరోసారి తనను నేషనల్ జనరల్ సెక్రటరీగా నియమించిన బీఎంఎస్ కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ జిల్లాలో బీఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్ గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మికుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న తమ యూనియన్ కు రోజురో జుకి జీహెచ్ఎంసీలో ఆదరణ పెరుగుతుందన్నారు. మరో మూడేళ్ల తర్వాత మళ్లీ బీఎంఎస్ జాతీయ కార్యవర్గం సమావేశం నిర్వహించి, జాతీయ కార్యవర్గంలో మార్పులు చేయనున్నట్లు కృష్ణ తెలిపారు.

మంత్రి వాకిటి శ్రీహరిని సత్కరించిన రవిశేఖర్‌రెడ్డి

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని అభినందిస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ జూన్ 16, ప్రభాతవార్త :

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడా యువజన శాఖ మంత్రిగా అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన మంత్రిని తిరుపతి వెంకన్న స్వామి శాలువాతో సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు ఎం.నరేందర్ రెడ్డి, కె.వి.రమణ,సంపత్‌కుమార్, మురళి ముదిరాజ్, నాగరాజు,భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా జిమ్‌కోచ్ మృతి

ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన

కంటోన్మెంట్, జూన్ 16 ప్రభాతవార్తః

సికింద్రాబాద్ రీసాలబజార్‌లో ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగాఓ జిమ్ కోచ్ మృతిచెందిన సంఘటన స్థానికంగా సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే జిమ్ కోచ్ జ్ఞానేశ్వం (24) ఆదివారం రాత్రి ఫ్రెండ్స్ తో కలిసి బిర్యాని తిన్నాడని, ఇంటి వద్దకు వచ్చిన అనంతరం ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపి వైద్యుడు వంశీ క్లినిక్ వద్దకు వెళ్లాడు. మృతుడిని పరిశీలించిన ఆర్ఎంపి వైద్యుడు జిమ్ కోచ్‌తో గ్యాస్ట్రిక్ సమస్య అని ఒక ఇంజక్షన్ ఇచ్చి పంపించాడు. మృతుడు క్లినిక్ నుంచి ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే ఇంటి వద్ద కుప్పకూలిపోయాడని, వెంటనే అతన్ని స్థానిక కంటోన్మెంట్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అతనికి సరైన ఆక్సిజన్ అందకపోవడం వల్లనే మృతి చెందినట్లు ధృవీకరించారు. దీంతో కోపోద్రిక్తులైన మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు క్లినిక్ వద్దకు చేరుకొని పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఆర్ఎంపి వైద్యునికి అనుభవం లేకపోవడం నిర్లక్ష్యం వహిస్తు ఇంజక్షన్ చేయడం వల్లనే జ్ఞానేశ్వర్ మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. ఆర్ఎంపి వైద్యుడిపై హత్య కేసు నమోదు చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లివిషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బంధువులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్ఎంపి వైద్యుడిని బొల్లారంలో అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్ఎంపి వైద్యునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో అనేక సందర్భాలలో ఆర్ఎంపి వైద్యుల నిర్లక్ష్యం వల్ల సామాన్యులు చెందుతున్నారని, ప్రభుత్వం, సంబంధిత మృతి వైద్య అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ప్రభుత్వం వైద్య ఉన్నతాధికారులు ఇలాంటి ఆర్ఎంపి వైద్యుల పట్ల కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మహిళను వివాహం చేసుకుంటానంటూ లక్షల్లో నగదు వసూలు

-బాధితురాలి ఫిర్యాదు..కేసు నమోదు

బేగంపేట జూన్ 16.ప్రభాతవార్త

మహిళను వివాహం చేసుకుంటానంటూ షాదీ డాట్ కామ్ లో పరిచయమైన ఓ వ్యక్తి మహిళను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించాడు. లక్షల్లో నగదు వసూలు చేసాడు. ఆమెపై పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ముఖం చాటేసాడు. అయితే బాధితురాలి ఫిర్యాదుతో అతని పై కేసు నమోదైంది. ఈ సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురా కు చెందిన మహిళ (47) కు వెస్ట్ ముంబాయికి చెందిన కల్పేష్ కక్కడ్ (42) షాదీ డాట్ కామ్ లో పరిచయమయ్యాడు. నిన్ను వివాహం చేసుకుంటానంటూ ఆమెకు ఫేస్ బుక్ రిక్వెస్ట్ పంపించి పరిచయం మరింత పెంచుకున్నాడు. 2023 జనవరి లో నగరానికి చేరుకున్న కల్పేష్ శశికాంత్ కక్కడ్ బేగంపేట లోని తాజ్ వివాంతా హోటల్ లో బస చేసాడు. పలు మార్లు బాధితురాలిని అక్కడికి రప్పించి ఆమెతో మాట్లాడాడు. తనకు చాలా ఆస్తులున్నాయని ఆమెను నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మ బలికాడు. పలుమార్లు బలవంతంగా అత్యాచారం చేసాడు. షేర్ మార్కెట్ లో పెట్టు బడులు అంటూ బాధితురాలితో పాటు ఆమె బంధువుల నుంచి రూ 22లక్షల వరకు డబ్బును అప్పుగా తీసుకున్నాడు. మరోసారి పెట్టుబడులంటూ బాధితురాలి ని నమ్మించి మరో రూ 2లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత మెల్లగా ముంబాయికి పారిపోయాడు. బాధితురాలు ఫోన్ చేసి పెళ్లి విషయం, డబ్బు విషయం ప్రస్తావిస్తే వారిద్దరూ సన్నిహిత సమయంలో తీసుకున్న ఫోటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని, మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడన్నారు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలి చేసేదేమిలేక శనివారం బేగంపేట పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు ఇన్స్పెక్టర్ బి.ప్రసాదరావు అత్యాచారం, మోసం కింద నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : కార్పోరేటర్

జీహెచ్ఎంసీ అధికారులతో బేగంపేట కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి.

బేగంపేట జూన్ 16,ప్రభాతవార్త

వర్షాకాలం నేపథ్యంలో నీరు నిలిచి ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని బేగంపేట కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అధికారులకు సూచించారు .సోమవారం బేగంపేట డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డీసీ డాకు నాయక్ సిబ్బందితో కల్సి ఆమె నీరు నిల్చి ఉండే ప్రాంతాలలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో చర్చించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పోరేటర్ మహేశ్వరి శ్రీహరి,డీసీ డాకు నాయక్‌తో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు ఎప్పటి కప్పుడు చెత్త తరలింపు,నాలాల పూడిక తీత,పారిశుధ్య సమస్యల పరిష్కారం, ఫాగింగ్ ,విద్యుత్ సమస్యల వంటి పనులను మూడు రోజుల పాటు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించనున్నట్లు తెలియజేసారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని వివిధ శాఖల అధికారులు కోరారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వరరావు,వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకుల

క్రీడల శాఖ మంత్రిని కలిసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి అభినందనలు తెలుపుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా,యువజన సర్వీస్‌ల శాఖల మంత్రి వాకిడి శ్రీహరిని సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధి కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అధిక చెక్కర తీసుకోవడాన్ని అరికట్టేందుకు అవగాహన పెంచాలి

మహేంద్రహిల్స్ డిపిఎస్ స్కూల్‌లో టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త: సమగ్రాభివృద్ధి,క్రీడాభివృద్ధిని పెంపొందించడం విద్యలో ఒక ముఖ్యమైన భాగమని ఎమ్మెల్సీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ మల్క కొమురయ్య పిలుపునిచ్చారు. సోమవారం మహేంద్రహిల్స్‌లోని డిపిఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బ్యాట్‌మెంటన్, బాస్కెట్ బాల్ క్రీడా మైదానాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో రాణించాలన్నారు. నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన షుగర్ బోర్డును క్విట్ ఇండియా ఉద్యమంలాగా ప్రచారం చేయాలన్నారు. చెక్కర బోర్డు సహకార కార్యకలాపాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. క్రీడలతో ఫిట్‌నెస్, పోషకాహారంపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విద్యార్థులతో పలువురిని అలరించే విధంగా బాడ్మింటన్ ఆడారు. ఈ కార్యక్రమంలో సిఈఓ మల్క యసస్వి ప్రిన్సిపాల్ నందిత సుంకర, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సురేఖ, అనూప్ కుమార్, విజయ్ మంగం తదితరులు పాల్గొన్నారు.

22న బిజెపి విజయోత్సవ సభ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందం

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన 11 సంవత్సరాల ఎసూపరిపాలన పూర్తైన సందర్భంగా, మల్కాజిగిరి పార్లమెంట్ సీట్ 4 లక్షల మెజార్టీతో బిజెపి కైవసం చేసుకొని సంవత్సరం పూర్తైన సందర్భంగా ఈ నెల 22న కంటోన్మెంట్ మట్‌పోర్ట్‌లోని ఇంపిరియల్ గార్డెన్‌లో 7 అసెంబ్లీ నియోజకవర్గాల బిజెపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం చేసిన సేవలు, సంక్షేమ అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విక్రం రెడ్డి, నందారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చెస్ ఫౌండేషన్ నిర్వహణలో టోర్నమెంట్

టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నిజాంపేట్, జూన్ 16, ప్రభాతవార్త

ప్రగతినగర్ సుందరయ్య భవనంలో ప్రగతి చెస్ ఫౌండేషన్ నిర్వహణలో జరిగిన టోర్నమెంటులో ముఖ్యఅతిథిగా డాక్టర్ రామచంద్రరావు, బయోగ్నిసిస్ ల్యాబ్ సిఎండి, విశిష్టఅతిథి డాక్టర్ ప్రశాంత్ ప్రముఖ సైంటిస్ట్, సుందరయ్య భవన నిర్వాహణ కమిటీ కన్వీనర్ సిహెచ్ఎం చారి, ప్రగతి చెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీనివాసరాజు, సీనియర్ సిటిజన్స్ డిప్యూటీ కన్వీనర్ రాజేశ్వరరావు బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొని విజేతలకు ట్రోఫీలు మెడల్స్ అందజేశారు. మొదటి రెండవ బహుమతుల విజేతలకు ప్రత్యేక క్యాష్ ప్రైజ్‌ను డాక్టర్ రామచంద్ర రావు గారు అందజేశారు.

తాళ్లగడ్డ యువజన సంఘం అధ్యక్షుడిగా అరుణ్ కుమార్ యాదవ్

తాళ్లగడ్డ యువజన సంఘం నూతన కమిటీ సభ్యులు.

మెహదీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త : తాళ్లగడ్డ యువజన సంఘం నూతన అధ్యక్షునిగా బూసనెల్లి అరుణ్ కుమార్ యాదవ్ నియమితులైనారు ఈ మేరకు సోమవారం తాళ్లగడ్డ హనుమాన్ దేవాలయంలో సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గొట్టే సందేశ్ కుమార్, సాతెల్లి శంకర్, గిరి హరినాథ్, బి.కృష్ణ, ఆకుల ఆదిత్య, ప్రధాన కార్యదర్శిగా గుండారపు హనుమంత్ రావు, కోశాధికారిగా ఆకుల రాజేష్, వ్యవస్థాపక కార్యదర్శిగా ఆకుల రఘువీర్, సాంస్కృతిక కార్యదర్శిలుగా గిరి సంతోష్, కోక క్రాంతి కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఆకుల శివకుమార్, గిరి మల్లిఖార్జున్, ఎన్.దుర్గాదాస్, గోదా మధుసూదన్, చెన్ను రాంబాబు, కె.శ్రీనివాసులు ముఖ్య సలహాదారులుగా గిరి వాసుదేవ్, సలహాదారులుగా ఎన్.దుర్గాదాస్, ఏ.రాజగోపాల్, కోక భద్రయ్య, గురజాల చంద్రమోహన్, రాజగోపాల్ లు నియమితులైనారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బూసనెల్లి అరుణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తాళ్లగడ్డ బస్తి అభివృద్ధితోపాటు ఆలయ అభివృద్ధికి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడతామన్నారు. తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

మెహదీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త : పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడంతో దేవాలయ పరిసరాలతో పాటు ఇబ్రహీం బాగ్ పరిసరాలని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. లంగర్ హౌస్ డివిజన్ ఇబ్రహీం బాగ్ లో కొలువుదీరిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ 6వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవ వేడుకను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పుణ్యాహ వచనం, గణపతి పూజ, నవగ్రహ మంటప ఆరాధన, శ్రీ లక్ష్మీ గణపతి, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, నవ కలశ పంచామృత అభిషేకం, విశేష పుష్ప అలంకరణ, మహా హారతి, మహా నైవేద్యం కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అమ్మవారి కళ్యాణ ఘట్టం కన్నుల పండుగగా జరిగింది. కళ్యాణ మహోత్సవంలో స్థానిక నేతలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఇంద్రసేనారెడ్డి, వి.ఎస్. రాజు, అంబేద్కర్, మాతంగి రమేష్, దర్శన రాజ్, జెన్న సుధాకర్ దేవాలయ కమిటీ చైర్మన్ దయానంద్, వైస్ చైర్మన్ పాండురంగం, కన్వీనర్ కుమార్, ట్రెజరర్ వి.శ్రీనివాస్, రాఘవులు, రమేష్, విష్ణు, వెంకటేష్, శ్రావణ్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న స్థానిక నేతలు.

రాజీవ్ రహదారి వెడల్పు వంద ఫీట్లకు కుదించాలి : తెలుకుంట

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త: సికింద్రాబాద్ సికింద్రాబాద్ ప్యాట్నీ జింఖానా గ్రౌండ్ నుంచి జెబిఎస్ మీదుగా శామీర్‌పేట్ వరకు వెళ్లే రాజీవ్ రహదారిలో ఉన్న వాణిజ్య సముదాయాలను వచ్చే నెల 7వ తేదీన మూసివేసి నిరసన చేపట్టాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ జేఏసి చైర్మన్ తెలుకుంట సతీష్ గుప్త పిలుపునిచ్చారు. రాజీవ్ రహదారిని 200 అడుగుల విస్తరించి ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో రహదారిని వంద అడుగుల మేరకు విస్తరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి ప్రతినిధులు కె.ఎఫ్.సి.ప్రవీణ్, కొమురవెల్లి వెంకన్న, గౌరిశెట్టి మునిందర్, భార్గవి, రాజేశ్, మనిగండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన బండి రమేష్

రమేష్‌ను అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కెపిహెచ్బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగా తన నియామకంలో మద్దతును ప్రకటించినందుకు శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా రమేష్‌ను ఆయన అభినందించారు.పార్టీలో మరింత ఉన్నత స్థానానికి ఎదిగేందుకు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఇరువురి నేతలు చర్చించారు.

సమగ్ర చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలి

గృహ కార్మికుల దినోత్సవ సంబరాలలో భాగంగా నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న ఎన్‌పిడిడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్

ధర్నాచౌక్, జూన్ 16, ప్రభాతవార్త:

సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి, దేశ వ్యాప్తంగా ఉన్న గృహ కార్మికులకు చట్టపరమైన రక్షణ మరియు సామాజిక భద్రతా హక్కులను నిర్ధారించటానికి సమగ్ర చట్టాన్ని తక్షణమే రూపొందించి, అమలుచేయాలని గృహ కార్మికుల జాతీయ వేదిక రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవ సంబరాలలో భాగంగా ఏర్పాటు చేసిన సభకు ఆమె హాజరై ప్రసంగించారు. సుప్రీంకోర్టు నుండి స్పష్టమైన ఆదేశం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సమగ్ర చట్టం చేసే ప్రక్రియను ప్రారంభించటానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తక్షణమే సుప్రీం కోర్టు ఆదేశాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంపై వత్తిడి పెంచేందుకు భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించారు. జాతీయ స్థాయిలో గృహ కార్మికులందరినీ కలుపుకుని, ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడిడబ్ల్యూయూ అధ్యక్షురాలు ఆన్ జోసెఫ్, జియుటీఎస్ అధ్యక్షురాలు వి.మంజుల, గృహ కార్మికులు పాల్గొన్నారు.

పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసుకుందాం

-టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కెపిహెచ్బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

కూకట్ పల్లి నియోజకవర్గం ఐడియల్ రంగాధముని చెరువు రోడ్‌లో ఉన్న శ్రీ పాప నాశేశ్వరా దేవాలయంలో జరిగిన శ్రీ రుద్ర చండి హోమం కార్యక్రమానికి ఆలయ కమిటి ఆహ్వానం మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా పాల్గొని పాప నాశ్వశ్వర స్వామికి రుద్రాభిషేకం చేసి, పార్వతి దేవి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ శ్రీ పాప నాశేశ్వరా దేవాలయం అతి పురాతనమైన ఆలయం, పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఆలయాలు ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్నిపెంపొందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమం లో ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగి రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, మొయినుద్దీన్, మహిళా డివిజన్ అధ్యక్షురాళ్లు జోజమ్మ,భారతమ్మ,సుంకన్న,సప్పిడి భాస్కర్, ఆలయ కమిటి సభ్యులు సప్పిడి దర్శన్,విశ్వనాథ్, వినోద్, పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వాకేటి శ్రీహరిని సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ తదితరులు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల, జూన్ 16, ప్రభాతవార్త

జీడిమెట్ల సబ్‌స్టేషన్1 నుండి 11కేవీ ఏపిఐఐసి ఫీడర్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఏపిఐఐసి కాలనీ, సంజయ్ గాంధీ నగర్‌లో విద్యుత్ ఉండదు. అలాగే జీడిమెట్ల సబ్‌స్టేషన్3 నుండి 11కేవీ పైప్‌లైన్ రోడ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గంపల బస్తీ, గణేష్ గ్రౌండ్స్, విజయశ్రీ కెమికల్స్ ఇండస్ట్రీయల్ ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని జీడిమెట్ల ఏఈ పి. ప్రసూన ఓ ప్రకటనలో తెలిపారు.

బోనాలకు రావాలంటూ ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వానం.

మెహదీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త : ఆషాడమాస బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటపై ఈనెల 26న ప్రారంభమవుతున్నడంతో బోనాల ఉత్సవాలకు రావాలంటూ స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌కు గోల్కొండ దేవాలయ వృత్తి పనివాళ్ల సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్ కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా కార్పొరేటర్లు నసిరుద్దీన్, వజీ ఉజ్జమ సిద్దికి, ఫరాన్ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...చారిత్రాత్మకమైన బోనాల ఉత్సవాలు మొట్టమొదటిగా తన నియోజకవర్గం నుంచి ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. బోనాల ఉత్సవాలను భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఆహ్వాన పత్రికను అందించిన వారిలో సలహాదారులు రావులకొల్లు నర్సింగ్ రావు, జి.సుధీర్, డప్పు రవి, ఎం.అశోక్, టి.శ్రీను, బి.నవీన్, వి.రాజు, ఎం.ధన్ రాజ్ లు ఉన్నారు.

సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవ వేడుకలు

దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని దత్తత్రయ కాలనీలోని శ్రీశ్రీశ్రీ సాయిబాబా దేవస్థానం 14వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై హారతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పి.ఎల్ ప్రసాద్, పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్, జగదీష్, మధుసూదన్ రెడ్డి, నిరంజన్ గౌడ్, శంకర్ గౌడ్, అశోక్, సత్యనారాయణ, పేరిశెట్టి, వెంకటేష్ గౌడ్, మంజుల, నాగమణి, ప్రసన్న, లక్ష్మి, రంగమ్మ పాల్గొన్నారు.

బండి రమేష్‌కి అభినందనల వెలువ...

బండి రమేష్‌ని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కెపిహెచ్బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్‌ని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కూన సత్యం గౌడ్ సోమవారం మూసాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ని కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శిరీష సత్తూర్ శ్రీనివాస్ గౌడ్, గాయత్రి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించటం హర్షనీయం

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త: తెలంగాణలో రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని మా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించటం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి నుండి బలంగా ఉందని, ఇతర పార్టీలతో పోలిస్తే తెలుగుదేశం పార్టీకే కార్యకర్తల బలం అధికంగా ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడు గారి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా తెలుగుదేశం పార్టీ కూటమితో కలిసి పోటీ చేస్తే ఫలితాలు బాగుంటాయని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని 39 డివిజన్లలో 35 డివిజన్లకు డివిజన్ కమిటీలను పూర్తిస్థాయిలో వేసుకుని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నూతన కమిటీల అభిప్రాయ సేకరణ

కొంపల్లి, జూన్ 16, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల ఏర్పాటుకు ప్రతిపాదన జాబితాలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ సమావేశం సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి కెవిఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, అబ్సర్వర్స్ పారిజాత నర్సింహ రెడ్డి, దుర్గం భాస్కర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి భూపతి రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో రాష్ట్రంలో నూతన కమిటీల ఏర్పాటు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కార్యకర్తలను గుండెలో పెట్టుకునే పార్టీ అని కార్యకర్తలు, నాయకులు పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. పార్టీ పదవులు అందిన, అందకపోయినా పార్టీ నాయకులు కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉండి గుర్తింపుని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, బ్లాక్ నాయకులు, డివిజన్ నాయకులు, మున్సిపల్ పరిధి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఇదే ఈ పాఠశాలల్లోనే కొనసాగించాలి : విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త:

సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న 6,7 తరగతుల్లో చదువుతున్న పిల్లలను ఇతర సస్థ్థాలకు పంపించకుండా మహేంద్రహిల్స్ స్కూల్‌లోనే 10వ తరగతి పూర్తి అయ్యేవరకు కొనసాగించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. 2025..26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నీట్ పౌండేషషన్ లో మెడిసిన్ ర్యాంక్‌లు సాధించడానికి విద్యార్థులను ఎంపిక చేసేందుకు మహేంద్రహిల్స్ నగరంలోని సికింద్రాబాద్ మహేంద్రహిల్స్, ఆర్‌కె.పురం గురుకుల పాఠశాలలో 8వ తరగతి నుంచి ఇంటర్ బైపీసీలో చేరేందుకు మార్పులు చేసింది. అదే విధంగా కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలని గౌలిదొట్టీల్లో ఎంపీసిసి ఇంజనీరింగ్ తరగతుల్లో చదువుతున్న పిల్లలను ఇతర సస్థ్థాలకు పంపించకుండా మహేంద్రహిల్స్ స్కూల్‌లోనే 10వ తరగతి పూర్తి అయ్యేవరకు కొనసాగించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. 2025..26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నీట్ పౌండేషషన్‌లో మెడిసిన్ ర్యాంక్‌లు సాధించడానికి కెటాయించారు. అదే విధంగా కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొట్టీ స్కూల్స్, ఇంటర్, ఎంపిసి గ్రూప్‌లతో ఇంజనీరింగ్, నల్లకుంచె సస్థ్థాల్‌ను స్పోర్ట్స్ స్కూల్ కెటాయించారు. దీంతో అకస్మాత్తుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో మహేంద్రహిల్స్‌లో చదువుతున్న 6,7 తరగతుల పిల్లలను ఇతర స్కూళ్లలో చేరేందుకు గురుకుల విద్యా సంస్థల సొసైటీలు నిర్ణయం తీసుకోవడం వల్ల అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడంతో పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందన్నారు. వారి భవిష్యత్తు దెబ్బతినకుండా, పిల్లలను ఇతర స్కూళ్లకు మార్చకుండా 10వ తరగతి వరకు అదే స్కూల్స్‌లో చదివే విధంగా నిర్ణయం తీసుకోవాలని విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు, ప్రగతి శీల తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము అమలు చేయాల్సి సవసస్తుందని అందు వల్ల ఈ అంశాన్ని తెలంగాణ గురుకుల కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళా లని ప్రిన్సిపాల్ శీలం సునీత కోరడంతో సమస్య సద్దు మనిగింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడి నుంచి మాసబ్ ట్యాంక్‌లో ఉన్న గురుకుల హెడ్ ఆఫీస్‌కు తరలివెళ్లారు.

మహేంద్రహిల్స్ గురుకుల బాలికల పాఠశాల ముందు ఆందోళన చేస్తున్నవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు 10వ తరగతి వరకు

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త:

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హరిచందన్ దాసరిని సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత త్వరలో ఫ్లాట్లు అలాట్ చేయాలని, అదే విధంగా సంవత్సరాల తరబడి రక్షణ శాఖ నస్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి భూ బదలాయింపుతో వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించాలని ఆమె దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ కార్డులు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవాణి, మూర్తి తదితరులు

హుడా కాంప్లెక్స్, జూన్ 16, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండడం కోసం అవసరమైన పరిస్థితుల్లో విశేషమైన వైద్య సేవలు అందుకోవడం కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయుక్తమైనదని దీనివలన సాధారణ పౌరులు ఉత్తమమైన వైద్య సేవలు అందుకోవడం సులభతరం అవుతుందని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏ.వి.ఆర్ మూర్తి లు అన్నారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆమే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్టూలు ప్రతి ఒక్క బ్రాహ్మణుడు డౌన్లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అందుకోసం బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రత్యేకంగా ఈ కార్డులను డౌన్లోడ్ చేసి ఉచితంగా అందిస్తోందని మూర్తి పేర్కొన్నారు. దాదాపు 386 మంది పైగా పాల్గొని కార్డు పొందరని, ఈ కార్డు ద్వారా దేశంలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స ను పొందే అవకాశం ఉందని ఐదు లక్షల వరకు వైద్య ఖర్చులకు ఈ కార్డు ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అద్యక్షుడు ధనం రెడ్డి, ఉపాద్యక్షుడు శ్రీనివాస్ రావు, కోశాధికారి సాయి కిరణ్, బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఎం. వి సోమేశ్వరులు, వైస్ ప్రెసిడెంట్ పూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు సునీత కార్యవర్గ సభ్యులు మోహనా చార్య, సరళ, విజయభాస్కర్, ఏక శిరీష, పి అనిత, ఎస్ ఎస్ ఎన్ శర్మ, వేమూరి ఆనంద్, మురళి, ఎస్ సురేష్, కే పద్మ లత, ప్రభాకర్, పాల్గొన్నారు.

వరద నీటి సమస్యకు త్వరలో ఎస్ఎన్. డి.పి.నాలా నిర్మాణపు పనులు : సుజాత నాయక్

వరద నీటి సమస్య ప్రాంతాల్లో అధికారులతో కార్పొరేటర్ సుజాత నాయక్

వనస్థలిపురం. జూన్.16.ప్రభాతవార్త. హస్తినాపురం వరద నీటి సమస్యను తీర్చేందుకు త్వరలో ఎస్ ఎన్ డి పి నాలా నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు జిహెచ్ ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ స్టాటజిక్ నాలా డెవలప్మెంట్ అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోహిణి తెలిపారు చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర్ రావు ఆదేశాల మేరకు వందనపురి కాలనీ కేకే గార్డెన్ మీదుగా బైరామలగూడ చెరువు వరకు నిర్మించనున్న ఎస్ ఎన్ డి పి వర్షకాలవ నిర్మాణ పనులు కొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు త్వరలో అట్టి పనులను చేపట్టాలని కాంట్రాక్టర్ స్థానిక అధికారులను ఆదేశించారు వందన పూరి కాలనీ నుండి బై రామల్ గూడ చెరువు వరకు నాలా నిర్మాణ పనులు పూర్తయితే వరద నీటి సమస్య పూర్తిగా పరిష్కరించనున్నట్లు అవుతుందని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు కాలువ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కోరారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మా ణ పనులను చేపట్టాలని కోరారు ఇట్టి నాలానిర్మాణ పనుల్లో ఆ యా ప్రాంతాలవాసులు భాగస్వామ్యులు అయ్యి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా సహకరించాలని కోరారు నాలా నిర్మించే ప్రాంతాలను కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోహిణి డి ఈ అనురాధ జిహెచ్ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్ మల్లికార్జున్ తో పాటు ఆయా ప్రాంతాల లో పరిశీలించారు.

సిపిఐ మహాసభను జయప్రదం చేయండి: రవీంద్ర చారి

హయత్ నగర్, జూన్ 16 ప్రభాతవార్త: సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న హయత్‌నగర్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరుగనున్న 10వ మండల మహాసభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాసభలు ఎంతో ప్రాధాన్యత కలిగినవన్నారు. మండల స్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి చాటి చెప్పే వేదికలుగా నిలుస్తాయన్నారు. మహాసభలకు ముఖ్య అతి థులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పాలమాకుల జంగయ్య హాజరుకానున్నారని పేర్కొన్నారు. మహాసభ విజయవంతానికి ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

డిగ్రీ కళాశాలలో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్ నగర్, జూన్ 16 ప్రభాతవార్త: హయత్ నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తునట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీ కోర్సులలో అడ్మిషన్ కోసం దోస్త్ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దోస్త్ మూడవ దశ దరఖాస్తు చేయడానికి చివరి తేదీ ఈ నెల 19 చివరి తేదీగా తెలిపారు. కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ , బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీ బీ ఏ)కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో దోస్త్ సహాయ కేంద్రం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. వివరాలకు దోస్త్ సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ బి. నరసింహ 994 8985954, టెక్నికల్ అసిస్టెంట్ కె. వినయ్ కుమార్ 9666 338001లను సంప్రదించాలని ఆయన సూచించారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమంతంగా ఉండాలి -కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్, జూన్ 16 ప్రభాతవార్త : తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని ప్రజలందరూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సోమవారం కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వర్షాల నేపథ్యంలో మున్సిపల్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్త తీసుకోవాలని విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ కే. అమరేందర్ రెడ్డి తెలియజేశారు అదేవిధంగా వర్షాకాలం ప్రారంభమైనందున తుర్కయంజాల్ మున్సిపాలిటీ సిబ్బంది పలు వార్డులలో వాడి పారవేసిన, కొబ్బరి బోండాలు, పాత టైర్ లో నీరు, ప్లాస్టిక్ బాటిల్ లో నిల్వ ఉన్న నీళ్లు ఉండకుండా,చూసుకోవలని, తెలియజేశారు. దోమల నివారణ కొరకు మురికి కాలువలు ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. పుర ప్రజలందరూ తడి పొడి హానికర చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకి మాత్రమే ఇవ్వవలె నని, స్వచ్ఛ ఆటోలు రానిచో మున్సిపాలిటీ దృష్టి కి తీసుకురా వలెనని తెలియజేశారు.ఎవరు కూడా బహిరంగంగా చెత్తను వేసే వారికి స్వచ్ఛ ఆటోలకి చెత్తను ఇవ్వని వారి వివరాలను సేకరించడం జరుగుతుంది. వారికి పలుమార్లు సిబ్బంది ద్వారా హెచ్చరించి, జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు.

అంగరంగ వైభవంగా శివలింగం స్తూపానికి ప్రత్యేక పూజలు

నేరేడ్ మెట్, జూన్ 16,ప్రభాతవార్త : శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము(కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము) మాసో త్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగినవి. ముందుగా దీపారాధన,కలశస్థాపన, పుణ్యాహవచనము ,లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హోమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నదానము ఘనంగా జరిగింది. .సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గణించిన న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెని లిమిటెడ్ రిటైర్డ్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ సీతంరాజు సూర్య కుమార్ కరుణకు,సంస్కృతాంధ్ర భాషా కోవిదులు, వైదిక కార్యక్రమ నిర్వాహకులు, సుబ్బారావు అనురాధ కు, నందగిరి వీరభద్ర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు, దేవాలయ అభివృద్ధి సమితి సభ్యులు శ్రీ నివాస్ శర్మ కళ్యాణికి, నిర్మల్ వాస్తవ్యులు శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి గారి ప్రియ శిష్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత, విశ్రాంత అధ్యాపకులు, గాదె ప్రమోద్ సరళలకు నలుగురికి ఉత్తమ దాంపత్య జీవన సాఫల్య పురస్కారములు మరియు వరంగల్ వాస్తవ్యులు శ్రీమయూరి నాట్య కళా క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యాచార్యులు శ్రీమతి కే అరుణ రాజ్ కుమార్ కి ఉత్తమ సాంస్కృ తిక నాట్య సేవా పురస్కారము శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీనిర్మల సంధ్య అంబికానాథ శర్మ దంపతులు అందజేసి సత్కరించారు. నాట్య గురువుల యొక్క శిష్యులు చక్కని నృత్యాభినయంతో కళా ప్రియులను కట్టిపడేశారు.పదాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ భావాలకు అద్దం పట్టేలా అభినయిస్తూ ప్రదర్శించిన నృత్యాంశములు అందరిని ఆకట్టుకున్నాయి. ఉత్తమ దాంపత్య జీవన సాఫల్యపురస్కార గ్రహీతలు సభలో మాట్లాడుతూ బాసర సరస్వతి క్షేత్రములో ఈ పురస్కారం అందుకో వడము ఆనందము గా మరియు గర్వముగా ఉన్నదని మరియు ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము లో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతి నెల మాసోత్సవము సందర్భ ముగా ప్రత్యేక పూజ కార్యక్రమములు, సంగీత, సాహిత్య, నృత్య, ధార్మిక , ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు దేవాలయ అభివృద్ధికి మేమంతా సహకరిస్తామని అన్నారు. భైంసా వాస్తవ్యులు శ్రీ గుజ్జుల వార్ సాయినాథ్ సంధ్య, ముత్యం సాంబశివరాజు సవిత, కొత్త వార్ శ్రీనివాస్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యా బోధనలే ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు : మొహసీన్ మొఘుద్దమీ

సమావేశంలో ప్రసంగిస్తున్న ఇరాన్ వైస్ కౌన్సిల్ మొహసిన్ మొఘుద్దామీ తదితరులు

మలక్ పేట, జూన్ 16, ప్రభాతవార్త: సమాజంలో చదువుకున్న వారికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, విద్యా బోధనలే ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు అవుతాయని ఇరాన్ వైస్ కౌన్సల్ మొహసీన్ మొఘుద్దమీ అన్నారు. చంచల్గూడా జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఎక్స్పో ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య లేనివాడు వింత పశువుతో సమానం అనే నానుడి ఉందన్న విషయాన్ని నొక్కి చెప్పారు. నిరక్షరాస్యత సమాజంలో కీడు సంస్కృతికి మూలం అయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడంతో పాటు ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు గణిత శాస్త్రం ఎంతగానో దోహద పడుతుందన్నారు. గణిత శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు విద్యార్థులు 70 వరకు సొంత ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్లో హైదరాబాద్ నగరంతో పాటు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు పాల్గొని తమ ప్రత్యేకతలను వివరించాయి. నీట్ పరీక్షలో తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు భారంగా మారిన ఎంబిబిఎస్ బోధనను సులభతరం చేసేందుకు ఇరాన్, కిర్గిస్తాన్, కజకిస్తాన్, యూకే, న్యూజిలాండ్, మలేషియా తదితర దేశాల్లో స్కాలర్షిప్ లతో కూడిన కోర్సులను అందించేందుకు గ్యాన్ దీప్ సంస్థ ముందుకొచ్చింది. ఈ కార్యక్రమంలో టైనీసైంటిస్ట్ అకాడమీ చైర్మన్ హామేద్ సల్మానీ, డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం, చంచల్గూడా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వుదిత్యాల రమణ రావు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు సయ్యద్ విఖారుద్దీన్ అలీ, డాక్టర్ సయ్యద్ ఇక్రాముల్లా హుస్సేని పాల్గొన్నారు.

జి.ఓ.118 కన్వీనియన్స్ డీడ్‌లను ఆపింది మధుయాష్కీనే : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

-చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ సమస్యకు పరిష్కారం చూపాలి : ఎమ్మెల్యే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం. జూన్16.ప్రభాతవార్త : రిజిస్ట్రేషన్ లకు సంభందించిన జి.ఓ.118, కన్వీనియన్స్ డీడ్ లను ఆపింది కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ అని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆరోపించారు. బి.యన్.రెడ్డి.నగర్ బి.ఆర్. ఎస్. అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలలో రిజిస్ట్రేషన్ ల పరిస్కారానికి అప్పటి అధికారులు, కె.టి.ఆర్, కె.సి.ఆర్ లు పూర్తి స్థాయిలో చర్చించి గజానికి రూ.250 చెల్లించి కన్వీనియన్స్ డీడ్లను అందిచామన్నారు.ఎన్నికల కోడ్ రావడంతో 25 శాతం మందికి కన్వీనియన్స్ డీడ్లను అందిచలేకపోయామన్నారు. కన్వీనియన్స్ డీడ్లు పొందిన కొందరికి ఇంటి అనుమతులు, గృహ రుణాలు, రిజిస్ట్రేషన్ లు జరిగాయన్నారు. ప్రభుత్వం మారడంతో ,రిజిస్ట్రేషన్ లను పునరుద్ధరించాలని పలుమార్లు అధికారులను కలవడం జరిగుందన్నారు.చివరకు సి.సి.ఎల్. ఆర్. అధికారులు రిజిస్ట్రేషన్ లు నిలిపివేయాలని ప్రభుత్వం మోకిక ఆదేశాలు ఇచ్చిందని తెలిపినట్లు సుధీర్ రెడ్డి వివరించారు. ఎమ్మెల్యే కాలనీవాసులను తప్పుడు జి.ఓ. తెచ్చి మోసం చేశాడని విషప్రచారం చేస్తున్న మధుయాష్కీ గౌడ్,చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వంలో ఉన్న మీరు ,కరెక్ట్ జి.ఓ. తీసుకువచ్చి ప్రజలకు న్యాయం చేయవచ్చు కదా అని సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం చూపకుండా,ఎమ్మెల్యే పై బురదజల్లే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ఏది ఏమైనప్పటికీ సమస్య పరిస్కారం అయ్యేంతవరకు విశ్రమించనని సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరం నర్సింహారావు,అనిల్ చౌదరి, సుమన్ గౌడ్, సతీష్ గౌడ్,సుధాకర్ యాదవ్,వివిధ కాలనీల ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,పొగుల రాంబాబు,ముత్యం రావు,రవీందర్ రెడ్డి,మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగని బిజెపి కార్పొరేటర్లు

- శ్రీరాములు యాదవ్, శంకర్‌రెడ్డి

మాజీ కార్పొరేటర్లను సన్మానిస్తున్న శ్రీరాములు యాదవ్, శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 16 ప్రభాతవార్త: కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల ప్రలోభాలకు లొంగకుండా పార్టీ మారకుండా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి కార్పొరేటర్లు ప్రజా సేవ చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డిలు ప్రశంసించారు. నాదర్‌గుల్‌లోని తోట జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ నేతలు శ్రీరాములు యాదవ్, శంకర్‌రెడ్డిలు మోడీ సుపరిపాలన వివరించి బిజెపి బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశనం చేశారు. అనంతరం గత జనవరిలో ఐదేళ్ళ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న బిజెపికి చెందిన మాజీ కార్పొరేటర్లకు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అదే విధంగా చక్కని నాయకత్వంతో బడంగ్‌పేట్‌లో బిజెపి బలోపేతానికి అహరం శ్రమించిన కార్పొరేషన్ పార్టీ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డిని కూడా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన ఐదేళ్ళ కాలంలో రాష్ట్రంలో, కార్పొరేషన్‌లో అధికారంలో ఉన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అధికార పార్టీ నేతలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా పార్టీ మారకుండా బిజెపి కార్పొరేటర్లు పని చేశారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు తర్రె మల్లేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, పలువురు సీనియర్ నాయకులు, అనుబంధ శ్రేణుల నేతలు పాల్గొన్నారు.

ఫార్ములా ఈ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కెటిఆర్‌కు విచారణకు వెళ్తున్న నేపథ్యంలో ఆయనను కలిసి మద్దతు తెలిపిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బాలాపూర్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నరూర్‌నగర్, జూన్ 16 ప్రభాతవార్త: బాలాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ సోమవారం ప్రారంభమైంది. కెఎల్ఆర్ ట్రస్ట్‌తో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్, పార్టీ నాయకులు బాల్‌నింగని జంగయ్య టేకుల సుధాకర్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, అమృతానాయుడు, భాను ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాళ్ళగూడెం ముత్యంరెడ్డి దశదిన కర్మ



ముత్యంరెడ్డికి నివాళులర్పిస్తున్న కుమారులు, కుమార్తెలు

సరూర్‌నగర్, జూన్ 16 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన అత్యంత వయో వృద్ధుడు, విశ్రాంత రైతు రాళ్ళగూడెం ముత్యంరెడ్డి (94) దశదిన కర్మ కార్యక్రమం ఘనంగా జరిగింది. బాలాపూర్ మండలంలోని స్వగ్రామం బడంగ్‌పేట్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో ముత్యంరెడ్డి కుమారులు రాళ్ళగూడెం ఆయిల్‌రెడ్డి, రాళ్ళగూడెం మల్లారెడ్డి, రాళ్ళగూడెం మల్లారెడ్డిల ఆధ్వర్యంలో దశదిన కర్మ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులతో పాటు బడంగ్‌పేట్ పరిసర గ్రామాలకు చెందిన పలువురు హాజరై ముత్యంరెడ్డికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాళ్ళగూడెం కుమారులు, కుటుంబ సభ్యులు, ముత్యంరెడ్డి కుమార్తెలు పొద్దుటూరు కళావతి రాంరెడ్డి, బొక్క జమున గోవర్ధన్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్నపూర్ణ కాలనీలో కమిటీ హాల్ స్లాబ్ పనులు ప్రారంభం

అన్నపూర్ణ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ గుప్తాను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి, సాయినీ అమృతం తదితరులు

బోడుప్పల్, జూన్ 16 ప్రభాతవార్త ; బోడుప్పల్ అన్నపూర్ణ కాలనీ కమిటీ స్లాబ్ ను మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి కాలనీ అధ్యక్షుడు యం. ప్రభాకర్ గుప్తా ప్రారంభించారు. అన్నపూర్ణ కాలనీ కమిటీ హాల్ స్లాబ్ కు దాతలు కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా 5 లక్షలు , మాజీ వార్డు సభ్యులు సాయిని అమృతం లక్ష రూపాయలు ఇచ్చినారు . మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి రెండో స్లాబ్ కు సిమెంటును ఇవ్వడానికి అంగీకరించారు . బోడుప్పల్ మున్సిపాలిటీ నిధుల నుండి కమిటీ హాల్ కు 10 లక్షలు మంజూరు చేసినందుకు మున్సిపల్ కమిషనర్ కమిషనర్ శైలజ , కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి ,మాజీ వార్డు సభ్యులు సాయిని అమృతం ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె .రాములు , గోపి కాలనీ అధ్యక్షుడు యం. ప్రభాకర్ గుప్తా ,ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ ,కోశాధికారి చంద్రకరన్ , సలహాదారులు జి బుచ్చిరెడ్డి , వివి రాఘవేంద్రరావు ,హేమశ్రీ మాధవి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు .

మంత్రి వివేక్‌ని కలిసిన మాజీ కార్పొరేటర్ కళ్యాణ్ కుమార్



కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బొమ్మక్ కళ్యాణ్ కుమార్,అరవింద్ ,రాహుల్ తదితరులు

బోడుప్పల్ ,జూన్ 16 ప్రభాతవార్త ; తెలంగాణా రాష్ట్ర నూతన కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాలు, గనుల శాఖా మంత్రి వివేక్ వేంకటస్వామి ని తన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు .రాష్ట్ర మంత్రివర్గంలో వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు . మంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ,యువజన కాంగ్రెస్ నాయకులు, అరవింద్, రాహుల్ పాల్గొన్నారు .

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 16 ప్రభాతవార్త: అఅభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైశాలినగర్‌లో రూ.8.85 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తిరుమల్‌రెడ్డి, అచ్యుతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు చదవాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క